క్లుప్తంగా

రైల్వే భూముల్లో గడ్డి కోతకు 21న వేలం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే భూముల్లో గడ్డి కోసుకోవడానికి ఈ నెల 21న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సీనియర్ సెక్షన్ ఇంజినీరు రామసుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సూచనల మేరకు రైల్వే సరిహద్దులలో సహజ సిద్ధంగా పెరిగిన గడ్డిని కోసుకోవడానికి 2025–26 సంవత్సరానికి సంబంధించి శనివారం మధ్యాహ్నం 3 గంటల సీనియర్ సెక్షన్ ఇంజినీరు కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కడియం–కేశవరం, కేశవరం–ద్వారపూడి, ద్వారపూడి యార్డు, అనపర్తి– బిక్కవోలు, బిక్కవోలు–పీబీ దేవం, పీబీ దేవం–మేడపాడు, మేడపాడు–సామర్లకోట స్టేషన్ల మధ్య ఉన్న గడ్డికి సంబంధించి వేలం ఉంటుందన్నారు. వేలంలో పాటతో పాటు 18 శాతం జీఎస్టీ పాటదారులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

పాలన చేతకాని దుస్థితిలో కౌన్సిల్

సామర్లకోట: మున్సిపాలిటీలో పరిపాలన చేతకాని దుస్థితిలో కౌన్సిల్ ఉందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. ఎమ్మెల్యే రాజప్ప వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించడంతో తెలుగుదేశం నాయకులు గురువారం విలేకర్ల సమావేశంలో కౌన్సిల్ తీరును విమర్శించారు. వర్గ పోరు కారణంగానే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టుకున్నారన్నారు. 2014 నుంచి ఎమ్మెల్యే రాజప్ప ఆధ్వర్యంలోనే అభివృద్ధి జరిగిందని, వైఎస్సార్ సీపీ పాలనలో కేవలం రెండు రోడ్లు మాత్రమే నిర్మించారన్నారు. విలేకర్ల సమావేశంలో టీడీపీ నాయకులు అబడాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, బలుసు వాసులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

సామర్లకోట: పిఠాపురం మండలం కుమారపురానికి చెందిన ఫీల్ అసిస్టెంట్ గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సామర్లకోట సీఐ ఎ.కృష్ణభగవాన్ కథనం మేరకు సామర్లకోట నుంచి పిఠాపురానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.అప్పారావు కోదండరామపురం వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ కృష్ణభగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయ వార్షికోత్సవ పూజలు

కరప: స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో గురువారం వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. గ్రామంలో చాగంటి వంశీయులు 1818లో నిర్మించిన ఆలయం శిథిలం కావడంతో వంశపారంపర్య ధర్మకర్త, వీఆర్వోల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చాగంటి వెంకట్రావు 2011లో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఏటా ఆలయ వార్షికోత్సవం పూజలు చేస్తున్నట్టు వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా చాగంటి వంశీయులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు విలపర్తి సత్యకృష్ణ, రాధాకృష్ణమూర్తి స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజాదికాలు నిర్వహించారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- దమ్ములు, నాట్లలో అన్నదాత బిజీ
- పూడుకుపోయిన కాలువల్లో కొద్దిపాటి నీటితోనే పొలం పనులు
- శివార్లకు అందని సాగునీరు
- పెట్టుబడికి అందని ధాన్యం సొమ్ములు



గోదావరి కాలువలో పెరిగిపోయిన తూటికాడ, గుర్రపు డెక్క



వీకే రాయపురంలో దమ్ములు చేస్తున్న రైతులు



పీబీ దేవంలో ఆకు మడులు వేయడానికి పట్టి తయారు చేస్తున్న రైతు

సామర్లకోట: గోదావరి కాలువకు నీరు విడుదల కావడంతో రైతులు ఖరీఫ్ వరి సాగుకు సిద్ధమవుతున్నారు. దమ్ములు చేసుకోవడం, వరి నాట్లు వేసుకోవడంలో వారంతా బీజీ అయిపోయారు. కూలీల కొరత, వారి రేట్లు పెరిగిపోవడంతో వెదజల్లు పద్ధతిలో సాగుచేస్తున్నారు. కూలీల కొరత, రేట్లు పెరిగిపోవడంతో రైతులు వెదజల్లు విధానంపై ఆసక్తి చూపుతున్నారు. కూలీలతో పని చేయిస్తే ఎకరానికి 10 మంది చొప్పున రూ.8 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. అదే వెదజల్లు అయితే ఒక కూలీతో సరిపోతుంది. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో లేక పోవడంతో డీలర్లు, బయట రైతుల నుంచి కొనుగోలు చేసుకొంటున్నారు. వెదజల్లు పద్ధతిలో సాగు చేసి యంత్రాలతో వరి కోతకు సిద్ధమవడంతో ఎకరానికి సుమారు రూ.25 వేలు ఖర్చు అవుతోందని రైతులు తెలియజేస్తున్నారు. అయితే పెట్టుబడికి ధాన్యం విక్రయించి 40 రోజులు గడిచినా సొమ్ము రాక పోవడంతో ఏంచేయాలో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు.

పూడికలతో నిండిన కాలువ

గోదావరి కాలువ వచ్చిందనే ఆనందం రైతులలో కనిపించడం లేదు. గోదావరి కాలువ వెంబడి తూటికాడ, గుర్రపు డెక్క పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు. గోదావరి కాలువలో నీటి మట్టం తక్కువగా ఉండటం, దీనికి తోడు గుర్రపు డెక్కతో కాలువ నిండి పోవడంతో పంట కాలువలకు నీరు సక్రమంగా రాకపోవడంతో శివారు భూములకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల పాటు గోదావరి కాలువ మూసి వేసిన సమయంలో ఇరిగేషన్ అధికారులు కాలువలో ఎటువంటి పనులు చేయకపోవడం వల్ల కాలువలో తూటికాడ పెరిగిపోయిందని రైతులు తెలియజేస్తున్నారు. ఏటా సార్వా, దాళ్వా సీజన్‌లో ఇదే పరిస్థితి ఏర్పడటంతో అధికారులు మొక్కుబడిగా గుర్రపు డెక్కను తొలగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఖాళీగా ఆర్బీకేలు

మండల పరిధిలో రైతు భరోసా కేంద్రాలు ఖాళీగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఆ కేంద్రాలలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేక పోవడంతో డీలర్ల వద్ద కొనుగోలు చేసుకుంటున్నామని రైతులు చెప్తున్నారు. దీనిపై ఎంఏఓ వి.మురళీధర్‌ను వివరణ కొరగా నూతనంగా బదిలీపై రావడంతో పూర్తి స్థాయిలో వివరాలు తన వద్ద లేవని తెలిపారు. అయితే 17 మెట్రిక్ టన్నుల విత్తనాలు ఆర్డరు పెట్టినట్లు తెలిసింది.

బీహారీ కూలీలతో నాట్లు



గోదావరి కాలువ రావడంతో ఎత్తిపోతల పథకం కింద సాగు ప్రారంభించడం జరిగింది. దీనిలో భాగంగా దమ్ములు చేసి పట్టిలు కట్టి ఆకుమళ్లు తయారు చేస్తున్నాం. బీహారీ కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నాం. వీరికి ఎకరానికి 10 కిలోల విత్తనం సరిపోతుంది. స్థానిక కూలీలకు ఎకరానికి 25 కేజీల విత్తనం కావాలి. రెండు పుల్లలతో నాట్లు వేయడం దిగుబడి కూడా ఎక్కువగా ఉంటుంది. డీలర్ నుంచి విత్తనాలు కొనుగోలు చేశాం.

– మలకల వరాలబాబు, రైతు, పీబీ దేవం

ధాన్యం సొమ్ములు అందలేదు



ధాన్యం విక్రయించి 40 రోజులు గడిచినా ఇప్పటి వరకు ధాన్యం సొమ్ములు జమ కాలేదు. రైతులకు అన్నదాత సుఖీభవలో రూ.20 వేలు ఇస్తామన్న హామీ ఏడాది గడిచినా అమలు కాలేదు. దాంతో రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సి వస్తోంది. ఆర్బీకేలలో విత్తనాలు, ఎరువులు లేవు. గోదావరి కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో శివారు భూములకు నీరు అందడం లేదు.

– ఇంటి వెంకట్రావు, రైతు, వీకే రాయపురం

విద్యార్థులకు యూనిఫాం మెటీరియల్ అందజేత



విద్యార్థులకు యూనిఫాం అందజేసిన విద్యా కమిటీ చైర్మన్ పశువులరావు

సామర్లకోట: మండల పరిధిలోని వీకే రాయపురం జిల్లా పరిషత్తు హైస్కూల్ విద్యార్థులకు గురువారం యూనిఫారం మెటీరియల్ అందజేశారు. విద్యా కిట్ల పంపిణీలో భాగంగా విద్యా కమిటీ చైర్మన్ గొల్లపల్లి పశువులరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నారాయణరావు, కో ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి నానాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల ఉద్యాన శాఖాధికారిగా శైలజ



పెద్దాపురం: స్థానిక మండల ఉద్యాన శాఖాధికారిగా కె.సత్య శైలజ గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పని చేసిన ఎస్.సుజాత తుని మండలానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో పిఠాపురం మండల హెచ్ఓగా పనిచేస్తున్న శైలజను ఇక్కడకు హెచ్ఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆమె ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శైలజ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైతులందరికీ అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానన్నారు. తాను కోనసీమ జిల్లా అమలాపురం, కాకినాడ జిల్లాలోని పిఠాపురం మండలాల్లో విధులు నిర్వర్తించానన్నారు. మెట్ట రైతుల వ్యవసాయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శైలజ పేర్కొన్నారు.

మట్టి మాఫియా బరితెగింపు



వడ్లమూరు ఏలేరు కాలువ గట్లపై మట్టిని ట్రాక్టర్లలో నింపుతున్న జేసీబీ

- ఏలేరు గట్లపైన అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

పెద్దాపురం: మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. ఎక్కడ పచ్చని పంటపొలం, మెట్ట కనబడినా దానిని తవ్వి లక్షల్లో సొమ్ము చేసుకోవడమే ధ్యేయంగా కూటమి నేతల దందా సాగిపోతోంది. కోట్ల రూపాయలు విలువ చేసే రామేశంమెట్టపై ఇప్పటికీ రాత్రనక, పగలనగ నిత్యం గ్రావెల్ దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగానే కట్టమూరు రహదారిలోని పెద్దాపురం పట్టణ పరిధిలో తాత చెరువుపై కూటమి నేతలు కన్నేసారు. సర్వే నెంబర్ 62/19లో సుమారు 6.51 ఎకరాల తాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతూనే ఉన్నారు. దీనికి తోడు మండలంలో అతి పెద్ద చెరువు రాయభూపాలపట్నం రాఘవమ్మ చెరువులో స్థానిక నలుగురు చోటా నాయకులు నిత్యం రాత్రనక, పగలనక మట్టి తవ్వకాలను జోరుగా సాగిస్తున్నారు. ఇదీ చాలదన్నట్టు మండలంలోని వడ్లమూరు ఏలేరు కాలువ మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలకు అంతేలేదు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడ చూడని పరిస్థితి. కూటమి నేతల కనుసైగతో గ్రావెల్, మట్టి వ్యాపారం లక్షల్లో జరుగుతోంది. ఎవరైనా పర్యావరణవేత్తలు ప్రశ్నిస్తే వారికి వార్నింగ్‌లు, అధికారులపై హుంకుం జారీ చేయడాలతో ఎదిరించే వారు లేక వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిపోతోంది. మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు, ఇసుక దందాలపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యోగాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

సామర్లకోట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21వ తేదీ ఉదయం 6.30 నుంచి 7.30 వరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 15 సచివాలయాలలో కార్యదర్శులు యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఉప్పాడ చేనేతకు చేయూత

కేంద్ర మంత్రికి ఎంపీ లేఖ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉప్పాడ కొత్తపల్లిలోని చేనేత రంగం అభివృద్ధికి నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంజూరు చేయాలని ఎంపీ టి.ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర టెక్స్‌టైల్స్‌శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్, కమిషనర్‌లకు రాసిన లేఖను ఇక్కడ పత్రికలకు విడుదల చేశారు. ఉప్పాడలో చేనేత రంగాన్ని అభివృద్ధిచేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు అనుసంధానం చేయాలని కోరారు. ఈ ప్రోగ్రాం ద్వారా రూ.15 కోట్లు విడుదల చేయాలని ఆ లేఖలో విజ్ఞప్తిచేశారు. కేంద్ర వాటా నిధులు రూ.12 కోట్లు మంజూరుచేసి తొలి వాయిదాగా రూ.3.5 కోట్లు విడుదల చేయాలని ఆయన అభ్యర్థించారు.

కంపోస్టు యార్డుగా ఏలేరు కాలువ



చెత్తను జేసీబీతో ఏలేరు కాలువలోకి తోసేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని ఏలేరు కాలువను మున్సిపల్ అధికారులు కంపోస్టు యార్డుగా మారుస్తున్నారు. ఈ రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్తను వారు కాలువలోకి పోయిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు ఈ విషయాన్ని వివరించగా రోడ్డు మార్జిన్‌లో చెత్త వేసేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెత్త వేయడం నేరమని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని, రాత్రి సమయంలో నైట్ వాచ్‌మెన్‌ను నియమించి చెత్త వేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు, పోలీసు కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రోడ్డు మార్జిన్లలో చెత్త ఉన్న ప్రతిసారీ దానిని ఏలేరు కాలువలోనికి నెట్టి వేయించడం వల్ల ఏలేరు కాలువ మూసుకుపోయి బ్రౌన్‌పేటలోనికి వరద నీరు వస్తోందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం రోడ్డులో ఉప్పు వారి సత్రం వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉండే వారు, మున్సిపాలిటీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొదండరామపురానికి చెందిన వారు ఈ రోడ్డు మీదుగా రాక పోకలు సాగిస్తుంటారు. పిఠాపురం వెళ్లే వారికి ఇదే ప్రధాన రహదారి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్డు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యమకారులకు ఆదర్శప్రాయుడు యాసలపు

- మున్సిపల్ చైర్మన్ తులసీ మంగతాయారు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ తులసీ మంగతాయారు

పెద్దాపురం: ఉద్యమకారులకు యాసలపు సూర్యారావు ఆదర్శప్రాయులని పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. కార్మిక నేత సూర్యారావు 13వ వర్ధంతి సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనం వద్ద గురువారం సాయంత్రం సాహితీ ప్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ తులసీ మంగతాయారు మాట్లాడుతూ సూర్యారావు విలువల విషయంలో రాజీ పడకుండా ప్రజా నాయకుడిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఆయన చూపిన చొరవ, పట్టుదల మరువలేనివన్నారు. సాహితీ ప్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు గానార, సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ యువతలో స్ఫూర్తి నిచ్చిన నాయకుడు యాసలపు సూర్యారావు అన్నారు. ఆయనపై ఉన్న అభిమానంతోనే ఏటా ఆయనను స్మరించుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తొలుత యాసలపు చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కవులు రచించిన కవితల సవ్వడి సంకలనాన్ని చైర్మన్ మంగతాయారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, యూటీఎఫ్ నేత ప్రభాకర్ వర్మ, ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి

- ఎంపీపీ సుధ
- పలు సమస్యలపై అధికారుల నిలదీత
- శాఖల వారీ అంశాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కారే సుధ

కొత్తపల్లి: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినపుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ కారే సుధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న పలు సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ప్రతినెల కంటే గత నెల విద్యుత్ బిల్లులు అధికంగా రావడం తల్లికి వందనం తగ్గిండానికేనంటూ ప్రజలు తమను నిలదీస్తున్నారని పలువురు ప్రజాప్రతినిధులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. పలువురికి 3, 4 విద్యుత్ మీటర్లకు ఒకే ఆధార్ నెంబర్ ఎలా నమోదు చేసారంటూ విద్యాత్ ఏఈని నిలదీశారు. తమను ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననివ్వడం లేదని, అధికారులు కూడా తమకు సరైన సమాచారం అందించడంలేదని ఎంపీటీసీలు దాకే నాగమహేశ్వరి, దుళ్ల సత్తిబాబు, కొండపల్లి సూర్య నాగేశ్వరావు పేర్కొన్నారు. గ్రామాల్లో చేసే అభివృద్ధి పనులను స్థానిక ప్రజా ప్రతినిధులకు కాకుండా బయటి వ్యక్తులకు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. పొన్నాడ శివారు రావివారిపోడులో ఉన్న పిల్లలు చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, కోనపాపపేట వరకూ నడిచి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ఖరీఫ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగునీటిపై చర్చించాల్సి సమయంలో ఆ శాఖ అధికారులు హాజరు కాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేదని దానిని రైతులు చెల్లించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తనాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్, పిఠాపురం మార్కెట్ యార్డు చైర్మన్ వాకపల్లి దేవి, ఎంపీడీఓ రవికుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్థక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ–1	85558 71069
ఎంఈఓ–2	94410 73418
ట్రాన్స్‌కో ఏడీఈ	94408 12600
ట్రాన్స్‌కో ఏఈ	94408 12634
ట్రాన్స్‌కో ఏఈ రూరల్	94408 12686

సికిల్ సెల్‌తో అప్రమత్తం

- డీఆర్వో వెంకటరావు
- వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సన్నాహాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

కాకినాడ సిటీ: జిల్లాలో 0–40 సంవత్సరాల వయస్సు గల ఎస్టీ పాపులేషన్‌కు సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని దీని ద్వారా సికిల్ సెల్ కారియర్, సికిల్ సెల్ వ్యాధి కలిగిన వారిని గుర్తించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ డిసీజ్ డేను పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించిన ర్యాలీని కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్ మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తరువాత వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధిని అవగాహనతోనే నిర్మూలించగలమన్నారు. వివాహం చేసుకునేటప్పుడు సికిల్ సెల్ కారియర్, సికిల్ సెల్ వ్యాధి కలిగిన ఏ ఇద్దరూ వివాహం చేసుకోకూడదని కౌన్సిలింగ్ నిర్వహించాలని, ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వం వారు ఉచితంగా అందిస్తున్న హైడ్రాక్సీ యూరియా టాబ్లెట్లను అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల నుంచి పొందవచ్చన్నారు. సికిల్‌సెల్ వ్యాధి కలిగిన వారు విధిగా రెగ్యులర్ చెక్ అప్స్ చేయించుకోవడం, పోషకాహారం తీసుకోవడం వల్ల జీవన నాణ్యత మెరుగుపడుతుందని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు ఆర్.రమేష్, సుబ్బరాజు, జిల్లా సికిల్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.అరుణ, డీపీఎంవో డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై కేంద్ర బృందం ఆరా



సర్పంచ్ చిన్నా నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం, తిమ్మాపురం గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. రెండు గ్రామాలలో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, రైతు భరోసా కేంద్రం, జగనన్న కాలనీలో అభివృద్ధి పనులు, పంట కాల్వల పూడిక తీత తదితర పనులను కేంద్ర బృందం సభ్యులు రుచి సిన్హా, బాల మురళి పరిశీలించి గ్రామస్తులు, ఉపాధి కూలీలతో మాట్లాడారు. నేమాంలో చేపట్టిన ఉపాధి పనులు గురించి సర్పంచ్ రామదేవు చిన్నా వివరించారు. అనంతరం పనుల వివరాలు, ఉపాధి కల్పన, తదితర అంశాలపై ఇన్‌చార్జి ఏపీఓ గణేష్ నుంచి వివరాలు సేకరించారు.

గ్రామ పాలన ‘స్వర్ణ పంచాయతీ’లో నమోదు

కరప: గ్రామ పంచాయతీలు నిర్వహించే కార్యకలాపాలన్నీ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీఓ టి.అన్నామణి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మండల ప్రగతిని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. గ్రామాలవారీగా ఆన్‌లైన్ నమోదును పరిశీలించి, ప్రగతి తక్కువగా ఉన్నపంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి పంచాయతీల ఆస్తుల వివరాలు, ఇంటిపన్నుల విధింపు, వసూళ్లు తదితర లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో జరపాలన్నారు. గ్రామ పంచాయతీల ఆన్‌లైన్ నమోదును డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు డీఎల్‌పీఓకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరాన్ని ప్రాతిపదికగా చేసుకుని పంచాయతీల డేటా అంతా ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతిదీ ఆన్‌లైన్ లోనే నిర్వహించాలన్నారు. ఇంటిపన్ను వసూళ్లు, కుళాయి పన్ను, ఆశీలు పాటల వివరాలు, ప్లాన్ అప్రూవల్ వంటి పంచాయతీల నిర్వహణ, ఆధార్ సీడింగ్ కార్యక్రమాలన్నీ సకాలంలో పూర్తిచేయాలని డీఎల్‌పీఓ అన్నామణి గ్రామ కార్యదర్శులకు సూచించారు.